క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎన్నికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ జవహర్

శ్రీశైలంప్రాజెక్ట్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో సున్నిపెంట బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎన్నికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బి.జవహర్ శనివారం తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాలో జరిగిన ఆటల పోటీల్లో అండర్–17 విభాగంలో వాలిబాల్‌లో ఎస్ వంశీవర్ధన్, టెన్నికాయిట్‌లో కె. జస్వంత్, అండర్–14 విభాగంలో కబడ్డీ, షార్ట్‌పుల్‌లో ఎం.కార్తీక్ రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారని ఆయన తెలిపారు. విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు జి. రాధాకృష్ణ, పి సుధాకర్, బి. తిమోతిరావులనుప్రిన్సిపాల్ అభినందించారు.

నాటుసారా స్వాధీనం

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామానికి చెందిన హరేంద్రబాబును అరెస్ట్ చేసి ఎనిమిది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం గ్రామంలో నాటుసారా విక్రేతల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. హరేంద్రబాబును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారన్నారు. దీంతో పాటు తిమ్మాపురం, గోపవరం, బొల్లవరం గ్రామాలకు చెందిన నలుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు.

దేశెట్టికి గ్రేట్ ఆర్టిస్ట్ అవార్డు


అవార్డు అందజేస్తున్న ముఖ్య అతిథులు

నందికొట్కూరు: చోడవరం చిత్రకళా నిలయం నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పట్టణానికి చెందిన దేశెట్టి శ్రీనివాసులు విజేతగా నిలిచి జాతీయ గ్రేట్ ఆర్టిస్ట్ అవార్డు, జాతీయ గురూజీ అవార్డులను అందుకున్నారు. శనివారం చోడవరం చిత్రకళా నిలయం ఆరోవ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో దేశెట్టి శ్రీనివాసులుకు అవార్డును అందజేసి సత్కరించారు. గతంలో 40పైగా జాతీయ, రాష్ట్ర అవార్డులను దేశెట్టి సొంతం చేసుకున్నారు.

మహానందిలో హోమాలు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో శనివారం రుద్ర, చండీ హోమాలు వైభవంగా జరిగాయి. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు హోమ పూజల్లో పాల్గొన్నారు. వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంత శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

మహానంది: ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని బండిఆత్మకూరు మండల ఉద్యానశాఖ అధికారి హరినాథరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని నారపురెడ్డికుంటలో శనివారం కొబ్బరిమొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఇంకా ఎవరైనా రైతులు ఆసక్తిగా ఉంటే సబ్సిడీతో మొక్కలు పంపిణీ చేస్తామని చెప్పారు.

ఓటరు నమోదు కార్యక్రమం

శ్రీశైలంప్రాజెక్ట్: మండల పరిధిలో శనివారం పోలింగ్ బూత్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో నూతన ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. శనివారం పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రాజేంద్రసింగ్ తనిఖీ చేశారు. పోలింగ్‌బూత్‌ల వద్ద ఏర్పాటు చేసిన స్పెషల్ క్యాంప్‌లలో ఓటరు జాబితాల్లో సవరణలు, తప్పొప్పులను సరిచేసుకోవచ్చన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన


మిడుతూరులో పంటను పరిశీలిస్తున్న దృశ్యం

మిడుతూరు: వర్షాభావ పరిస్థితుల కారణంగా దెబ్బతిన్న పంటలను (పత్తి, మినుము, కంది, మొక్కజొన్న) పంటలను జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు, జిల్లా ఏరువాక కేంద్రం ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణారావు, ఏడీఏ విజయశేఖర్ పరిశీలించారు. శనివారం మిడుతూరు, వీపనగండ్లలో పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. వీఏఎస్ అశోక్, రాము, రైతులు శాంతి, శాలుమియ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మహానంది : మహానంది నుంచి ఇంటికి బైక్‌పై వెళ్తున్న చాబోలు గ్రామానికి చెందిన సాయినాథ రెడ్డికి తీవ్రగాయాలైన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. బైక్‌పై వెళ్తున్న అతడిని అల్లినగరం సమీపంలో తమ్మడపల్లె గ్రామానికి చెందిన బాషా స్కూటర్‌తో వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం నంద్యాల ఆసుపత్రికి తరలించారు.

వేతనాలు పెంచాలి

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం డిమాండ్ చేశారు. పట్టణంలోని సుదర్శన వర్మభవనంలో శనివారం ఏపీఅంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్స్ యూనియన్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

మహానందిని మోడల్ టెంపుల్‌గా తీర్చిదిద్దుతాం

- భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం
- త్వరలో 75 వసతి గృహాల నిర్మాణం
- గడువు ముగిసిన తర్వాత బాబు మళ్లీ జైలుకే
- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి


మహానందిలో అభివృద్ధి పనులపై సూచనలిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: మహానంది క్షేత్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లో మోడల్ టెంపుల్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తూ మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మహానందిలో సొంత నిధులు రూ.3కోట్లతో జరుగుతున్న సుందరీకరణ, అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ధర్మకర్తలు గంగిశెట్టి మల్లికార్జున, వెంకటేశ్వర్లులతో కలిసి ఆలయ పరిసరాల్లో పనులను పరిశీలించి ఆర్కిటెక్చర్ నిపుణులకు పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ టీటీడీ నిధులు రూ.4.60కోట్లతో 25, దేవస్థానం నిధులు రూ.పది కోట్లతో సుమారు 50 వసతి గృహాలను నిర్మించనున్నట్లు చెప్పారు. టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే పనులు మొదలుపెడతామన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఆర్కిటెక్చర్లు జగదీష్, దివాకర్‌రెడ్డిలకు సుందరీకరణ పనులపై పలు సూచనలు చేశారు. వ్యాపారుల కోసం అందంగా కనపడేలా దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక షెడ్లు నిర్మిస్తామన్నారు.

మధ్యంతర బెయిల్‌కే సంబరాలు హాస్యాస్పదం

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆ పార్టీ నేతల అత్యుత్సాహం చూస్తుంటే మధ్యంతర బెయిల్‌పై వచ్చినట్లు కనపడలేదని ఎమ్మెల్యే అన్నారు. మధ్యంతర బెయిల్ అనే విషయం మరిచిపోయిన విజయోత్సవాలు చేయడం హాస్యాస్పదమన్నారు. గడువు ముగిశాక బాబు మళ్లీ జైలుకెళ్లాల్సిందేనని చెప్పారు. కేవలం పెయిడ్ ఆర్టిస్టుల చేత పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు డ్రామాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. టీడీపీ, జనసేనలు ఏకమైనామంటున్నాయని, కొత్తకాపురం బానే ఉంటుందని, రేపు సీట్ల కేటాయింపులో అసలు భవితవ్యం బయటపడుతుందన్నారు. రెండు పార్టీలను ప్రజలు నమ్మేపరిస్థితుల్లో లేరన్నారు.

9 నుంచి 'వై ఏపీ నీడ్ జగన్'

ఈ నెల తొమ్మిదవ తేదీ నుంచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. మండలానికి పదిహేను మంది నాయకులను ఎంపిక చేసి ప్రతి గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులు, వెచ్చించిన నిధులపై ప్రత్యేక సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాలకు, ఇప్పటి సీఎం జగన్ ప్రభుత్వానికి తేడాలను వివరించి ప్రజాభిప్రాయాన్ని తీసుకుంటామన్నారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి కావాలని ప్రజలే కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ నాగభూపాల్‌రెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ శరభారెడ్డి, ఎంపీటీసీలు వెంకటేశ్వర్లు, మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ లక్ష్మిరెడ్డి, మండల నాయకులు ఒంటెద్దు వీరారెడ్డి, కుంచపు శ్రీనివాసులు, బాలవెంకటరెడ్డి, సాగేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ జయసింహారెడ్డి, భూమా సుబ్బరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం మంజూరు

బండిఆత్మకూరు మండలం శింగవరం, సోమయాజులపల్లె గ్రామాలకు చెందిన ఇద్దరికి అటవీశాఖ తరఫున రూ. 50వేలు నష్టపరిహారం మంజూరైనట్లు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. ఇటీవల చిరుతపులి దాడిలో ఆవులు మృతి చెందాయన్నారు. దీంతో శింగవరం గ్రామానికి చెందిన దాసరి మహాలక్ష్మికి రూ. 35వేలు, సోమయాజులపల్లెకు చెందిన వెంకటసుబ్బయ్యకు రూ. 15వేలు చొప్పున పరిహారం వచ్చిందన్నారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్‌ఝా పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నంద్యాల : శ్రీశైలం నియోజకవర్గానికి చెందిన 44 మంది లబ్ధిదారు లకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.39. 43 లక్షల విలువైన చెక్కులను శనివారం నంద్యాల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని కొన్ని వ్యాధులకు, ప్రమాదాల బారినపడి చికిత్స చేయించుకున్న పేదలను ఆర్థికంగా ఆదుకోవడానికి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం చేస్తుందని చెప్పారు.

విద్యార్థులు పురోగతి సాధించకుంటే చర్యలు

కొత్తపల్లి: గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు చదువులో పురోగతి సాధించకుంటే ఉపాధ్యాయులను విధుల నుంచి సస్పెండ్ చేస్తానని జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ శివప్రసాద్ హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామ సచివాలయం పరిధిలోని పాలెంచెరువు గూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. శుక్రవారం రాత్రే అక్కికి చేరుకున్న ఆయన విద్యార్థులతో కలసి పాఠశాలలో బసచేసి, భోజనం, వసతులను పరిశీలించారు. శనివారం ఉదయాన్నే పాఠశాల పరిసరాలను పరిశీలించి, విద్యార్థులతో ప్రార్థన చేయించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 1నుంచి 3 తరగతి విద్యార్థులను పరీక్షించగా కనీసం అఆలు, ఏబీసీడీలు కూడా చెప్పలేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులపై ఆగ్ర హం వ్యక్తం చేశారు. ప్రతిరోజు ఉపాధ్యాయులు రాత్రి 7 నుంచి 9 గంటల వరకు ఇద్దరు షిఫ్టలవారీగా విధులు వేసుకొని విద్యార్థుల చదువులో పురోగతి సాధించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు.


విద్యార్థులతో కలిసి టిఫిన్ చేస్తున్న డీటీడబ్ల్యూఓ

రైతుల సంక్షేమానికి ప్రభుత్వ రాయితీలు


శిక్షణను ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

నందికొట్కూరు: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక రాయితీలు అందిస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో 2023–24 దేశీ శిక్షణ (డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ సర్వీసెస్ ఇన్‌పుట్ డీలర్స్) నూతన బ్యాచ్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జేసీ మాట్లాడుతూ రైతులు రాయితీలను సద్వినియోగం చేసుకునేలా డీలర్లు అవగాహన కల్పించాలన్నారు. దేశీ శిక్షణలో నేర్చుకున్న సూచనలు, సలహాలు రైతులకు ఇవ్వాలని సూచించారు. అత్యధిక దిగుబడులు సాధించేందుకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు సరఫరా చేయాలన్నారు. శిక్షణ ద్వారా నేర్చుకున్న తెగుళ్లను నివారించే పద్ధతులను రైతులకు నేర్పించి తీర్చిదిద్దాలన్నారు. అనంతరం జేసీని వ్యవసాయ అధికారులు, డీలర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నంద్యాల, కర్నూలు జిల్లా వ్యవసాయ అధికారులు మోహన్‌రావు, వరలక్ష్మి, డివిజన్ అధికారులు విజయశేఖర్, శాస్త్రవేత్తలు వెంకటేశ్వర్లు, రామకృష్ణారావు, మంజునాథ్, ఏఓలు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు ఉపయోగకరం


మందులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదలకు ఉపయోగకరంగా ఉన్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. పట్టణంలోని పుల్లారెడ్డి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రతి కుటుంబసభ్యులు వైద్య పరీక్షలు నిర్వహించుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రతి పేద వాడికి వైద్య పరీక్షలు అందించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని జగనన్న ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు రషీద్, వైస్ చైర్మన్ రాజగోపాల్, విజయ్, విజయచౌదరి, హరిప్రసాద్, పార్వతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ విభాగపు కార్యదర్శి తిమోతి తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఆత్మకూరు: పొదుపు మహిళలు మరింత ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, కమిషనర్ శ్రీనివాసరావు, మెప్మా ఆత్మకూరు మున్సిపాలిటీ మిషన్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, సీఓ హుస్సేన్‌బీ అన్నారు. పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం పొదుపు మహిళా సంఘాలకు వివిధ వస్తువుల తయారీ, వ్యాపారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. చైర్ పర్సన్ మాట్లాడుతూ.. పొదుపు సంఘాల్లో మహిళలు స్వయంగా తయారు చేసిన వివిధ వస్తువులను స్వయంగా విక్రయించి ఆర్థికంగా బలపడాలన్నారు. వస్తువుల తయారీలో నాణ్యత పాటిస్తే ప్రజలు కొనగోలు చేస్తారన్నారు. ఆర్‌బీలు, ఓబీలు, పరిమళ, షఫీవూన్, రవణమ్మ, కౌసల్య, దరగమ్మ, మేరమ్మ పాల్గొన్నారు.

రోఖియాబీ దర్గా పునర్నిర్మాణానికి శ్రీకారం


రోఖియాబీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎంపీపీ, ప్రజాప్రతినిధులు

వెలుగోడు: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రత్యేక చొరవతో పట్టణంలోని రోఖియాబీ దర్గా పునర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రోఖియాబీ దర్గాకు ప్రత్యేక విశిష్టత ఉంది. ఇక్కడ ప్రతి ఏటా ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. దర్గా శిథిలావస్థకు చేరడంతో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రత్యేక చొరవ చూపి రూ.30 లక్షల నిధులు మంజూరు చేయించారు. దీనికి తోడు ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు షంషీర్ తదితరుల సహకారంతో పునర్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు దర్గా పునర్ నిర్మాణానికి ఎంపీపీ, సర్పంచ్ నాయకులు షంషీర్‌తో పాటు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఎం ఇలియాస్ ఖాన్, ఖాదర్ వలి తదితరులు ప్రత్యేక ప్రార్థనలు చేసి పనులను ప్రారంభించారు.

అభివృద్ధికి సహకరించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ సరోజినీ వర్ధినియ

పాములపాడు: అధికారులు, ప్రజా ప్రతినిధులు మండలాభివృద్ధికి తోడ్పడాలని ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపంచారు. అనంతరం సభ్యులు ప్రజా సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాలను 10 వ తరగతికి అప్ గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని ఎంఈఓ బాలాజీనాయక్‌కు కోఆ ప్టెడ్‌సభ్యులు ముర్తుజావలి కోరారు. రెండు సంవత్సరాలుగా చెబుతున్నను ఇప్పటి వరకు పట్టించుకోకపోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. బానుముక్కల గ్రామంలో సచివాలయం నిర్మాణంలో బిల్లుల చెల్లింపులో పంచాయతీరాజ్ జేఈ రాఘవేంద్రప్రసాద్ తీరని అన్యాయం చేస్తున్నారని వైస్ ఎంపీపీ బండ్లమూరి వెంకటేశ్వర్లు మండిపడ్డారు. ఇదిలా ఉండగా సమావేశంలో 13 మంది ఎంపీటీసీలకు గాను నలుగురు, 14 మంది సర్పంచులకు గాను ఆరుగురు మాత్రమే హాజరయ్యారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

- రూ.22.78 కోట్లతో 38కిలో మీటర్ల మేర రోడ్ల నిర్మాణం
- ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోని రోడ్లకు మోక్షం
- సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు


మాట్లాడుతున్న జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి

జూపాడుబంగ్లా: మండల పరిధిలో ఎన్నో ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోని గ్రామీణ రోడ్లకు నిధులు మంజూరు చేయడంతో జెడ్పీటీసీ పోచా జగదీశ్వర రెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం వారు జూపాడుబంగ్లా పాత సినిమా థియేటర్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జూపాడుబంగ్లా మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రమైన నంద్యాలకు త్వరగా చేరుకునేందుకు వీలుగా నూతన గ్రామీణ రహదారులు మంజూరు చేశారన్నారు. మిడుతూరు మండలంలోని చెరుకుచెర్ల, భైరాపురం, తిమ్మాపురం గ్రామాల మీదుగా పారుమంచాల వరకు 9.8 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి రూ.6.65కోట్లు మంజూరైనట్లు తెలిపారు. పారుమంచాల నుంచి రోళ్లపాడు గ్రామానికి 7.4 కిలోమీటర్ల మేర రూ.5.50కోట్ల నిధులతో రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే పారుమంచాల గ్రామం నుంచి తూడిచెర్ల మీదుగా మద్దూరు గ్రామం వరకు 9.70 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.4.80 కోట్ల నిధులు కేటాయించారని వెల్లడించారు. వీటితో పాటు కర్నూలు–గుంటూరు రహదారి నుంచి వెలుగోడు వరకు 5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.3.23కోట్లు, మిడుతూరు మండలంలోని నాగలూటి, పైపాలెం, కడుమూరు వరకు 6.10 కిలోమీటర్ల మేర రూ.2.60కోట్లతో రోడ్డు నిర్మించనున్నట్లు తెలియజేశారు. ఈ రోడ్ల నిర్మాణం పనులు టెండర్ల దశలో ఉన్నాయని, టెండర్లు ముగిసిన వెంటనే పనులు ప్రారంభించి ఎన్నికల కోడ్‌వచ్చేలోగా పూర్తిచేయనున్నట్లు తెలిపారు. టీడీపీ పాలనలో గ్రామీణ రహదారులను ఏనాడు పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకా గ్రామీణ రోడ్లకు మహర్దశ వచ్చిందన్నారు. కార్యక్రమంలో సహకార సొసైటీ చైర్మన్ వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు దొడ్డా సుధాకర్, చెన్నారెడ్డి, తరుణ్‌కుమార్‌రెడ్డి, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలి

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- పాత ముచ్చుమర్రిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'
- ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆర్థర్

పగిడ్యాల: ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ మండల స్థాయి అధికారులను ఆదేశించారు. శనివారం పాత ముచ్చుమర్రి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జగనన్న సంక్షేమ బావుటా బుక్‌లెట్స్‌ను ఇంటింటికీ అందజేసి నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలకు చేకూర్చిన ఆర్థిక లబ్ధిని వివరించారు. సామాజిక భద్రత పింఛన్లు, పక్కా గృహాలు, అభయాస్తం పింఛన్ మంజూరు, కిందకు వేలాడుతున్నా విద్యుత్ తీగల సమస్యపై గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.

ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెంచాలి

రాబోయేది సార్వత్రిక ఎన్నికల సీజన్ కావున గడప గడపలో ప్రజలు తమ దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే అన్నారు. అందువల్ల ప్రాధాన్యతను బట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేసి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాలని కోరారు. గ్రామ పంచాయతీకి మంజూరయ్యే రూ. 20 లక్షల నిధులతో ప్రాధాన్యత సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు సేవ చేయడమే మనందరి కర్తవ్యమన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్లను తనిఖీ చేసి పిల్లలకు అందుతున్న పోషకాహారంపై ఆరా తీసి వారి సామర్థ్యాలను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి, జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, సర్పంచ్ పెద్ద ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పుల్యాల నాగిరెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమాదేవి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు రమణ, మాజీ సర్పంచ్ మద్దిలేటి, కాటం వెంకటరమణ పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామానికి చెందిన షేక్ షుకూర్‌బాషా(48) శనివారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సచివాలయ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంటు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ విషయాన్ని వైఎస్సార్ బీమా కార్యాలయానికి తెలియజేశారు. వారు సత్వర సహాయం కింద అంత్యక్రియల కోసం రూ.10వేల నగదును మంజూరు చేశారు. వెంటనే ఆ మొత్తాన్ని సచివాలయ ఉద్యోగులు గ్రామ సర్పంచ్ వంగల లక్ష్మిదేవమ్మ చేతులమీదుగా మృతుని కుమారుడు షేక్ షేక్షావలికి అందజేశారు. వలంటీరు పురుషోత్తంరెడ్డి , వైఎస్సార్‌సీపీ నాయకుడు వంగల కృష్ణారెడ్డి, వీఆర్‌ఏ బిక్కుసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలు

శ్రీశైలంప్రాజెక్ట్: ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్, స్పెషల్ ప్రొటెక్షన్ పోలీస్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌ను శనివారం నిర్వహించారు. సున్నిపెంటలోని డీఏవీ పాఠశాలలో అవినీతి, నిఘా అంశాలపై విద్యార్థులకు జెన్‌కో ఇంజినీర్ వీడీఎస్ఎస్‌ఎల్ కాంతారావు, ఎస్ఈ వి.శ్రీనివాసరావు, ఈఈ ఎంవీ సుధాకర్, సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, డీఏవీ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ టి.కోటేశ్వరరావు అవగాహన కల్పించారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన డీఏవీ పాఠశాల విద్యార్థులు సీహెచ్ లికిత, సునయన తబస్సుం, సి.శాంభవి, నాగప్రణీత, వివిఎస్ ఆదిత్య కుమార్, డి.వాసవి, టి ఎస్ సదన్, వై.సహస్ర, టి.భార్గవసాయి, లకు బహుమతులను అందజేశారు.

పంటల సాగులో మెలకువలు తెలియజేయండి

కొత్తపల్లి: రైతులకు పంటల సాగులో మెలకువలు తెలియజేయాలని ఏఓ కె.మహేష్ సూచించారు. శనివారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆర్బీకే సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రబీసీజన్ మొదలైందని గ్రామాలలో రైతులు ఏఏ పంటలను సాగుచేసుకుంటున్నారన్న విషయాలపై ఆరా తీశారు. పంటల స్థితిగతులను అడిగితెలుసుకున్నారు. అదేవిధంగా ఎక్కడైతే నీటిలభ్యత పుష్కలంగా ఉంటుందో అక్కడమాత్రమే రబీ పంటలను రైతులు సాగు చేసుకోవాలని సూచించారు.

వైభవంగా షిర్డీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ


ప్రతిష్ఠ వేడుకల్లో ఎమ్మెల్యే ఆర్థర్

పగిడ్యాల: మండల పరిధిలోని నెహ్రూనగర్ గ్రామ శివారులో వైఎస్సార్‌సీపీ నాయకులు సాయివిజయ పొలంలో సుమారు 52 సెంట్ల విస్తీర్ణంలో నిర్మించిన షిర్డీ సాయిబాబా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ఈనెల 2 నుంచి ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కాగా.. కార్యనిర్వాహక ట్రస్టు సభ్యులు బోయ సాయివిజయ ఘన స్వాగతం పలికారు. జెడ్పీటీసీ పుల్యాల దివ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పుల్యాల నాగిరెడ్డి, గ్రామ సర్పంచ్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లో నీటి నిల్వలపై సర్వే


మండ్లెం చెరువును పరిశీలిస్తున్న అధికారులు

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న చెరువులు, నీటికుంటలు, చెక్‌డ్యాంలలోని నీటి నిల్వలు, నీటి నిల్వ సామర్థ్యాలపై గణాంకాధికారులు సర్వే ప్రారంభించారు. శనివారం మండలంలోని తర్తూరు, మండ్లెం గ్రామాల్లోని చెరువులు, నీటికుంటలను ఉపగణాంకాధికారులు రామాంజనేయులు, హనుమంతు పరిశీలించారు. చెరువులు ఎప్పుడు నిర్మించారు. వాటి కింద ఎన్ని ఎకరాల ఆయకట్టు విస్తరించి ఉంది. చెరువులో నీటినిల్వ సామర్థ్యం ఎంత, ప్రస్తుతం ఎంత మేర నీటి నిల్వలున్నాయి. అనే వివరాలను సేకరించనున్నట్లు వెల్లడించారు. ఈనెల 10తేదీలోగా మండలంలోని అన్ని గ్రామాలు పర్యటించి చెరువులు, నీటికుంటల వివరాలు సేకరించి నివేదికలను కలెక్టర్‌కు నివేదించనున్నట్లు తెలిపారు.

పంటకోత ప్రయోగం

మండలంలోని మండ్లెం గ్రామంలో శనివారం మొక్కజొన్న పంటలో ఉపగణాంకాధికారులు రామాంజనేయులు, హనుమంతు పంటకోత ప్రయోగం నిర్వహించారు. నిర్దేశించిన కొలతల ప్రకారంగా దిగుబడి లెక్కించగా 7.720కిలోల దిగుబడి వచ్చినట్లు వారు తెలిపారు. వాస్తవ దిగుబడి కంటే చాలా తక్కువ దిగుబడి వచ్చిందని, వర్షాభావ పరిస్థితులే దీనికి కారణమని వెల్లడించారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా పంటల ఇన్సూరెన్స్ తరుపున సంజయ్, మునావర్, వీఆర్వో ఈశ్వరయ్య, వీఆర్‌ఏలు జగదీష్, వెంకటేష్, మీరంబాషా పాల్గొన్నారు.

మాదిగల విశ్వరూప మహాసభకు తరలిరండి

వెలుగోడు: ఏబీసీడీ వర్గీకరణ సాధనకై హైదరాబాదు నగరంలో ఈనెల 11న తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభకు పెద్ద ఎత్తున తరలి రావాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శి నాగేశులు మాదిగ, మండల అధ్యక్షుడు ఆరోగ్యం మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక మారెమ్మ గుడి ఆవరణలో శనివారం విశ్వరూప మహాసభ పోస్టర్లను సంఘం నాయకులు విడుదల చేశారు.

సమయానుకూలంగా బస్సులు నడపాలి

పాములపాడు: పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల సమయానుకూలంగా బస్సు సర్వీసులు నడపాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ స్వాములు డిమాండ్ చేశారు. శనివారం విద్యార్థులతో కలిసి స్థానిక బస్టాండ్ సెంటరులో రాస్తారోకో చేశారు. గ్రామాల నుంచి దాదాపు 150 మంది విద్యార్థులు పాములపాడు, ఆత్మకూరుకు వెళ్తారన్నారు.

ఎక్కడుంటే అక్కడే పింఛన్


కర్నూలు ఆసుపత్రిలో తలారి సుధాకర్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వేల్పులదాసు


నంద్యాల ఆసుపత్రిలో ప్రకాశమ్మతో వేలిముద్ర వేయిస్తున్న వలంటీరు సౌజన్య

కొత్తపల్లి: గ్రామ వలంటీర్లు నిబద్ధతతో పనిచేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. లబ్ధిదారులు ఎక్కడుంటే అక్కడికి వెళ్లిమరీ పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. మండలంలోని ముసలిమడుగు గ్రామానికి చెందిన తలారి సుధాకర్ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకొని చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ వేల్పుల దాసు శనివారం కర్నూలుకు వెళ్లి చికిత్స పొందుతున్న సుధాకర్‌కు వృద్ధాప్య పింఛన్ రూ.2750 లను అందజేశాడు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ నగదు అందజేత

జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచెర్ల గ్రామానికి చెందిన బోకూరి ప్రకాశమ్మ అనే వృద్ధురాలు కాలువిరగడంతో నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. వలంటీరు సౌజన్య తన సొంత ఖర్చులతో నంద్యాల ఆసుపత్రికి వెళ్లి ప్రకాశమ్మకు పింఛన్ నగదు అందజేసింది. దీంతో వృద్ధురాలు వలంటీరుకు కృతజ్ఞతలు తెలిపారు.